
కాంప్లెక్స్ కథలు

# మూషిక సుందరి కాంప్లెక్స్



ఒక సన్యాసికి తన పాదాల దగ్గర చేరిన ఎలుక సుందరి పైన దయ కలిగింది. దానిని లోకంలోకెల్లా గొప్పవాడికిచ్చి పెళ్ళి చేయాలను కున్నాడు. మొదట సూర్యుణ్ణి అడిగాడు. తనను అడ్డుకొనే మేఘుడే

తన కంటే గొప్ప అన్నాడు సూర్యుడు. తనను అటకాయించే పర్వతమే గొప్ప అన్నాడు మేఘుడు. తనను లోలోపల తొలిచే ఎలుక తన కంటే గొప్ప అన్నాడు పర్వతుడు. చివరికా సన్యాసి ఎలుక సుందరిని, ఎలుక యువకుడికిచ్చి పెళ్ళి చేసాడు.

ఇది మూషిక సుందరి కాంప్లెక్స్.

* * *



రవి ఆనందానికి అవధులు లేవు— తన కథకు అవార్డు వచ్చినందుకు కాదు. ఆ విషయం సగర్వంగా పద్మకు చెప్పుకో గలిగే అవకాశం

వచ్చినందుకు, ఉప్పొంగిపోతున్న మనసును అదుపులో పెట్టుకుంటూ అదేదో తనకు అతి సామాన్యమైన విషయం అన్నట్లు మామూలుగా అన్నాడు.

"పద్మా! నా నవల ఆధారంగా తీసిన జాగృతి సినిమా కథకు ఈ సంవత్సరం నాకు ఉత్తమ కథా రచయిత అవార్డ్ ఇస్తున్నారు!"

పద్మ కళ్ళు ఉత్సాహంతో, సంతోషంతో మిల మిల మెరిసాయి.

"కంగ్రాచ్యులేషన్స్! అదేదో పెద్ద అవార్డే కదూ? రచయితగా నీకు మంచి గుర్తింపు అన్నమాట!"

అమాయకంగా అలా అడిగేస్తున్న పద్మకు చటుక్కున ఏ సమాధానం చెప్పాలో తెలియలేదు రవికి. వచ్చిన చిక్కు ఎక్కడంటే, రచయితగా రవిని ఎంతో గౌరవించే పద్మ, రవి నవలలు ఒక్కటి కూడా చదవ లేదు. రవి నవలలే కాదు, అసలు తెలుగు నవలలు ఏవీ చదవ లేదు పద్మ. సైన్సు స్టూడెంట్ కావటం వలన ఫిక్షన్‌లో అంత ఆసక్తి

---

## డా॥ సి. ఆనందారామం

---

లేదు. మొదటి నుండీ ఇంగ్లీషు మీడియంలో చదవటం వలన తెలుగు చక చక చదవలేక, నిదానంగా చదివే ఓపిక లేక, అసలు తెలుగు నవలల జోలికి పోదు.

రచయితగా సాహిత్య ప్రపంచంలో తన స్థానానికీ, ఈ అవార్డ్‌కీ నిజంగా సంబంధం ఉందా?

ఈ ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పలేక డొంక తిరుగుడుగా, "అంతమందిలో అవార్డ్ అందుకోవటం అనేక ప్రత్యేకత కదూ!" అన్నాడు.

సాహితీ లోకపు సుడిగుండాలతో ఏ మాత్రం సంబంధం లేని

పద్మ వెంటనే, "అవునవును!" అని ఒప్పేసుకుని, "నాకు సెలవుగా, నేమా వస్తాను." అంది.

రవి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతూ, "నిజంగా! అయితే, మనం అక్కడే హోటల్లో...." అంటూ ఏదో అనబోతుండగా పద్మ నవ్వుతూ అడ్డుకొని "డోంట్ బి సిల్లీ! నేను మా ఆంటీ ఇంట్లో ఉంటాను. ఫంక్షన్‌కి నీతో వస్తాను" అంది.

పద్మ తనతో వస్తుంది- తను గొప్పగా అవార్డ్ అందుకోవటం కళ్ళారా చూస్తుంది. ఆహా! ఏం అదృష్టం! రచయితగా తనకు గుర్తింపు మాట దేవుడెరుగును కాని, పద్మ దృష్టిలో తన ఇమేజ్ పెరుగుతుంది. అంతకంటే ఏం కావాలి?

"ఫంక్షన్‌కి కొత్తసూటు కుట్టించుకున్నావా?" అడిగింది పద్మ.

గుటక మింగాడు రవి. సూట్ అంటే మాటలు కాదు, అంత డబ్బు తన దగ్గర లేదు. ఆ మాట మరొకరికి ఎలాచెప్పడం? అందులోనూ పద్మతో....

"లేదు పద్మా! అయినాఅలాంటి ఫంక్షన్స్‌కి నేను సూట్‌లో వెళ్ళ కూడదు. అక్కడికి ప్రొడ్యూసర్లూ, డైరెక్టర్లూ, యాక్టర్లూ ఎందరో ఎంతో స్టయిల్‌గా వస్తారు. వాళ్ళ ముందు నేను రచయితగా ప్రత్యేకంగా కోవతి, లాల్చీలలో ఉంటేనే బాగుంటుంది."

"అయితే, నేనే నీకు మంచి ధోవతి, లాల్చీ బట్ట సెలెక్ట్ చేస్తాను."

ఆ మరునాటంతా రవి, పద్మ షాపులన్నీ తెగ తిరిగారు. కొన్ని పల్చగా ఉన్నాయనీ, మరికొన్ని ముతకగా వున్నాయనీ, జరీ అంచు అసహ్యంగా, మొరటుగా ఉందనీ.... జరీఅంచు లేకపోతే మరీ మామూలుగా వుందనీ.... పద్మ నానా హడావుడి చేస్తోంటే రవి నవ్వి, "పద్మా! మొత్తానికి అడదానివనిపించుకుంటున్నావ్? ఏదో ఒకటి తీసుకుందాం!" అన్నాడు.

పద్మ ఒప్పుకోక, "అంత గొప్ప అవార్డ్ అందుకుంటున్నావు మంచి డ్రెస్ ఉండొద్దూ?" అని దబాయించి మరో షాపుకు దారి తీసింది.

పద్మ 'అంత గొప్ప' అంటోంటే కాదనటానికి నోరు రాలేదు రవికి.

ఎలా అయితేనేం, షాపింగ్ పూర్తి చేసింది పద్మ. తన ఆంటీ అడ్రసు ఇచ్చి, "టైమ్‌కి వచ్చి నన్ను తీసుకెళ్ళు" అంది.



తాను వెండి తెరమీద చూసే తారల్ని ప్రత్యక్షంగా చూస్తోంటే చాలా గమ్మత్తుగా అనిపించింది పద్మకి. కళ్ళు పెద్దవి చేసుకుని ఊపిరి బిగబట్టి అందర్నీ చూస్తోన్న పద్మను చూస్తూ, లోలోపల చాలా ఆనందించాడు రవి.

తాను చూస్తోన్న ఆ తారలు తెర మీద బొమ్మల్లా లేరు పద్మకి. సజీవంగా కదులుతోన్న ఆ వ్యక్తులు మామూలుగా తన లాగే వున్నారు. కాకపోతే ప్రత్యేకించి స్టయిల్‌గా అలంకరించుకున్నారు చాలామంది. మాటలో, చూపులో, నవ్వులో, ప్రతి కదలికలో ఒక స్టయిలు మైన్‌టైన్ చేయాలనే కాన్షస్‌నెస్ ఇంచుమించు అందరిలోనూ కనిపిస్తోంది. "అబ్బ! ప్రతిక్షణం తమ రూపు రేఖా విలాసాలు మరిచిపోకుండా ఇలా జాగ్రత్త పడవలసిందేనా వీళ్ళు?" అనుకుంది పద్మ.

వెనుక నుండి ఎవరో వేదిక మీదకి వెళుతున్న తారల గురించి కొంటె వాఖ్యానాలు చేస్తున్నారు.

"వీళ్ళలో వీళ్ళకే మళ్ళీ వేళాకోళాలు, వెటకారాలూ కూడానా?" అనుకుంది పద్మ.

అక్కడే ఎవరో రవిని గౌరవంగా పలకరించి, "మీరు ఇటీవల వ్రాసిన 'మలయ పవనాలు' అందరూ బాగుందంటున్నారండీ! వానిని నేను కొందామనుకుంటున్నాను. మీరు ఏ హోటల్లో వున్నారో చెప్పండి. తర్వాత మాటాడతాను" అన్నారు.

పద్మ సమక్షంలో అలాంటి ఆఫర్ వచ్చినందుకు రవి పొంగి పోతూ, తన అడ్రసు ఇచ్చాడు "హాయ్! హాయ్!" అనుకున్నాడు.

ఫంక్షన్ పూర్తయి, ఇంటికి వెళ్ళేటప్పుడు పద్మ రవిని హీరో చూసినట్టే చూసింది, "అయామ్ ప్రౌడ్ అఫ్‌యు రవీ!" అంది. ఆ మాటతో స్వర్గలోకపు అంచులు చుట్టి వచ్చాడు రవి.

ఆ మరునాడు తన పినతల్లిగారి అమ్మాయిలు చిన్నా, చిట్టిలతో కలిపి మహాబలిపురం బయలుదేరింది పద్మ. శిల్పాలు చూస్తుండగా హోరున వాన కురిపింది. అందరూ లోపలి మండపాల్లోకి వచ్చారు. అక్కడికి రాగానే ఒకప్పుడు రవి సరదాగా వర్ణించిన, "స్టోరీ డిస్కషన్" గుర్తుకొచ్చింది పద్మకి.

పాపం రవి. ఏదో కొత్తరకం కథ రాసాడు. అందులో కథానాయిక పెళ్ళికాకుండానే గర్భవతి అవుతుంది. సంఘానికి భయపడకుండా ఎదుర్కోవాలని నిశ్చయించుకుంటుంది. ఈ సన్నివేశాన్ని దర్శక నిర్మాతలు ఆమోదించలేక పోయారు. ప్రేక్షకులు ఒప్పుకోరేమోనని వాళ్ళు ఒప్పుకోలేక పోతున్నారు. ఆ సన్నివేశం సినిమాటిక్‌గా ఎలా ఉంటే బాగుంటుందో దర్శకుడు వివరిస్తున్నాడు.

"హీరో, హీరోయిన్లు పిక్‌నిక్‌కి వెళ్తారండీ! అక్కడ పెద్ద వాన వస్తుంది. ఇద్దరూ తడిసిపోయి, పక్కనున్న గుడికి వెళతారు. ఆ తర్వాత ఆ తర్వాత...."

ఆపుకోలేక పైకే నవ్వేసింది పద్మ.

"ఏవిటి పద్మక్కా! వానలో తడుస్తూ నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్?" అంది చిట్టి.

"ఏం లేదు" అని తన ఆలోచనలలోంచి తెప్పరిల్లి వాళ్ళతో కలిసింది.

సముద్ర తీరంలో ఉన్న దేవాలయం కంటె సముద్రమే బాగుంది పద్మకి. ఉవ్వెత్తున ఎగసిపడే అలలతో ఆనందిస్తూ, చెలియలి కట్ట లోలోపల చిందులు వేసే ఆ అనంత గాంభీర్యం ఎప్పుడూ ఒక అపూర్వ ఆకర్షణే! ఏమిటీ సముద్రం? వేయి బాహువులు చాచి "రా రా రా!" అని శివమెత్తి పోతూ ఆకర్షిస్తోంది తనలోకి.... అదే క్షణంలో "జాగ్రత్త! జాగ్రత్త! జాగ్రత్త!" అని హోరు హోరు మంటూ హెచ్చరిస్తోంది——ఇక్కడ సృష్టిశక్తి తన విశ్వ రూపాన్ని ప్రదర్శిస్తోంది. అంచేతే ఆకర్షణలో మాధుర్యమూ, ప్రలోభంలో ప్రమాదమూ ఒకే క్షణంలో కళ్ళముందు నాట్యమాడుతున్నాయి. ఆకర్షణలో మాధుర్యాన్ని ఆస్వాదిస్తోనే ప్రలోభంలోని ప్రమాదానికి దూరంగా అవతలిగట్టు మీద నిలవగలిగే శక్తి, అచ్ఛాదనలు లేని అచ్ఛమైన ప్రకృతి వళ్ళో

మాత్రమే పొందగలుగు తున్నాడు మానవుడు. విశ్వరూప సందర్శనం వల్ల కలిగే జ్ఞాన సిద్ధి ఇదేనా?

బీచ్ రిసార్ట్‌లో కాటేజెస్ చూస్తోంటే అక్కడ ఉండిపోవాలని పించింది పద్మకి. పైకి మామూలుగా ఏదో పాకలా కనిపిస్తూ లోపల అన్నీ ఆధునిక సౌకర్యాలతో ఇంద్రభవనంలా ఉంది. (ఇంద్రభవనం ఒక వేళ వున్నా ఇంత గొప్పగా ఉండదేమో!) కాటేజ్ మధ్యలో ఉయ్యాల, ఎ. సి. రూమ్స్, రంగుల బల్బులమర్చిన హరికెన్ లాంతర్లూ. మందంగా వినవచ్చే పాశ్చాత్య సంగీతమూ—

అక్కడ ప్రధానంగా ఫారినర్స్ ఉంటారట!

ఎంత అందంగా ఉంది ఈ జీవితం! కానీ, ఎంత ఖరీదైనది? తనకెలా లభిస్తుంది? ఏం? ఎందుకు లభించదు? అందరూ తనను ఎంతో అందమైనదని అంటారు. కోటీశ్వరుడైన ఎవరో ఒక విదేశీయుడు తనను చూసి ప్రేమించి పెళ్ళి చేసుకుంటే....అప్పుడు తను దర్జాగా....

తన ఆలోచనలకు ఉలిక్కి పడింది పద్మ. ఛీ! ఏమిటీ మనసు ఇంత కోతిలాంటిది? మానవుడికి దేవుడిచ్చిన గొప్ప వరం, మన మనసులో ఆలోచనలు మనకు తప్ప మరొకరికి తెలియక పోవటం! అలా తెలిసి పోయే రోజు ఏ ప్రమాద వశాన్నయినా వస్తే, లోకంలో క్షణమయినా తలెత్తుకు నిలవగలిగే వాళ్ళు ఎంత మంది ఉంటారు?

ఇంటికి వచ్చి అద్దంలో తన ప్రతిబింబం చూసుకుని కెవ్వున కేక వెయ్యబోయి ప్రయత్నం మీద నిగ్రహించుకుంది పద్మ. ఒకే ఒక్క రోజు మామూలుగా అలవాటైన పాలూ, పళ్ళరసాలూ, మజ్జిగలూ లేకుండా, ఎండకు ఎండి, వానకు తడిసి, సముద్రపు గాలి సోకివచ్చే సరికి శరీరమంతా నల్లగా కప్పువేసి నట్లయి పోయింది. ఒక్క రోజు ఇలా తిరిగిన పాపానికి ఈ వెధవ శరీరానికి కనీసం వారం రోజుల "రిపేర్" కావాలి! ఈ మాత్రపు సౌందర్యానికే, విదేశీయులేవరో తనను

ప్రేమించి అందల మెక్కించేస్తారని అనుకోవటానికి సిద్ధపడింది! సినిమా తారల తీరు కృత్రిమంగా ఉందనుకుంది. ఆ మాటకొస్తే ఈ లోకంలో కృత్రిమం కానిదేది? యోగబలంతో మనసును నియమించు కొని శరీరాన్ని ప్రకృతి శక్తుల కతీతంగా నిలుపుకోగలిగిన పరమ హం సలూ-ప్రకృతి శక్తులతో శరీరదార్ఢ్యం పెంపొందించుకొని,మనసుతో ఆలో చించటం తెలియని ఆటవికులూ తప్ప, అందరూ ఏదో ఒక విధంగా కృత్రిమంగా బ్రతుకుతున్న వాళ్ళే!



రవికి ఫోన్ చేసింది.

"రవీ! అయామ్ సారీ! రేపు మీ స్టోరీ డిస్కషన్‌కి సరదాగా నేనూ వస్తానన్నాను. కానీ రాలేను. నేను ఇవాళే వెళ్ళి పోతున్నాను."

న్యాయంగా రవికి ఎంతో నిరుత్సాహం కలిగించవలసిన ఈ మాటలు నిరుత్సాహం కలిగించక పోగా, రిలీఫ్ నిచ్చాయి. "థేంక్ గాడ్!" అనుకున్నాడు.

రవి నవలను సినిమాగా కొంటానన్న ప్రొడ్యూసర్ వచ్చాడు. దగ్గిర దగ్గిర రెండు గంటలు కూచుని అదీ, ఇదీ, అన్నీ 'డిస్కస్' చేసాడు. అంతా అయ్యాక "మీ నవల చాలా గొప్పగా ఉందండీ. అందులో సందేహం లేదు. కానీ, కమర్షియల్‌గా అది సినిమాకి సక్సెస్ అవదేమో అని ఆలోచిస్తున్నాను. మనం వ్యాపారదృష్టితో కూడా ఆలోచించుకోవాలి కదండీ! సరే- మళ్ళీ వస్తాను." అని వెళ్ళిపోయాడు.

రవి ప్రాణం ఉసూరుమంది. ఈ "కమర్షియల్ వేల్యూ" అనే మాట ఎక్కడి కక్కడ గొడ్డలి వేటులా తగులుతోంది రవికి. ఒక్క చలనచిత్ర రంగంలోనే కాదు, అన్ని రంగాలలోనూ ఇది రాకాసిలా నోరు తెరచి అన్ని విలువలనూ మింగెయ్యాలనే చూస్తుంది.

ప్రయోగాత్మకంగా, ప్రయోజనాత్మకంగా, నిశితమైన పరిశీలనా దృష్టితో జీవితచిత్రాన్ని కళాత్మకంగా ప్రదర్శించిన సాహిత్యం కంటె కమ్మని కాలక్షేపం కలిగించే హాయిమనే తన ధోరణిలో సాగె అల్లిక కథలకే కమర్షియల్ వేల్యూ ఎక్కువ- ఈ కమర్షియల్ వేల్యూస్ కాదని పత్రికలు నిలువలేవు- పత్రికలు లేకుండా పాఠకులు లేరు. పాఠకులు లేకుండా రచయితకి రాణింపు లేదు. న్యాయానికి ఒక రచయిత నవల సినిమాగా రావటానికీ, సాహితీ లోకంలో అతని విలువకీ ఏ విధమయిన సంబంధము లేదు- కానీ, సినీ రచయితకు సామాన్య జనంలో ఉండే ఒక గ్లామర్ అతని పాప్యులారటీకి ఒక కారణమవుతోంది.

తన కసలు బుద్ధిలేదు. తెలిపి తెలిసి తనెందుకు ఈ ప్రలోభంలో చిక్కుకోవాలి? ఇదంతా గాలి వాన!

ఏ క్షణంలో పడుతుందో ఎవరూ చెప్పలేరు. చిత్రవిచిత్రమైన వేగంతో చలించి పోయే చలన చిత్ర ప్రపంచం ఇది! ఈ మాత్రం భాగ్యానికి తనెన్ని కలలు కన్నాడు? పద్మ వస్తుందనీ...."తన గొప్ప తనం" చూసి కుంచించుకు పోతుందనీ... అప్పుడు తను ఎంతో ఉదారంగా తన కంటె ఎంతో క్రింద ఉన్న పద్మకు చెయ్యి అందించి....

కోతి మనసు! తనను కనికరించి తన జీవితంలో అమృతపు జల్లులు కురిపిస్తోన్న పద్మనే అల్పంగా అంచనా వేసుకోవటానికి తయారయిపోయింది!

స్టోరీ డిస్కషన్‌కి వస్తానన్న పద్మతో, ప్రొడ్యూసర్ అసలు రావటం లేదని ఎలా చెప్పాలా అని సతమతమవుతోన్న రవికి పద్మ వెళ్ళిపోతున్నాననటం ఎంతో హాయిగా తోచింది.

"అదేం? ఎందుకంత హడావుడిగా వెళ్ళిపోతున్నావు?"

"కొద్దిగా ఆరోగ్యం పాడయింది- ఏం పరవాలేదు- రెండు రోజులు రెస్ట్ తీసుకుంటే తగ్గిపోతుంది...."

"ఆరోగ్యం పాడయిందా? నేను రానా?"

పద్మ గుండె గుభిల్లుమంది. ఈ అవతారంలో తనను రవి చూడటమా? తెల్లవారింది మొదలు అందమైన తారల మధ్య తిరుగుతూ కూడా తనేదో అందమైన దాన్నని తనను ప్రేమిస్తున్నాడు!

"నో- నో! నువ్వు రావద్దు! నువ్వు స్టోరీ డిస్కషన్‌లో కూచోవాలిగా! అది ముఖ్యం!"

"అవునవును! రావాలనుకున్నా రాలేను. అయామ్ సారీ!"

పాపం- పద్మ! కాలేజి బ్యూటీగా పేరుపొంది, ఎందరెందరో కోరి కలలు కన్న పద్మ, తనేదో సినిమా రైటరని తన గ్లామర్ పెంచుకొంటూంది.

"ఏం పరవాలేదు. త్వరలోనే కలుస్తాంగా! విష్ యు బెస్ట్ అఫ్ లక్!"

"ఓ.కే. విష్‌యు ఎ హాపీ జర్నీ!"

"బై!"

"బై!"

*